ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
3
శుక్రవారం 13 జూన్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

13-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	36	28
తెనాలి	36	28
నరసరావుపేట	35	26
బాపట్ల	36	29
రెంటచింతల	36	28
చీరాల	36	29

పంచాయతీల్లో..

పైసలు లేవు

- విడుదల కాని ఆర్థిక సంఘం నిధులు
- నిధుల గండంతో ఆందోళనలో సర్పంచ్‌లు
- రూ.70.52 కోట్లు కోసం నెలలుగా ఎదురుచూపు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంచాయతీలు వట్టిపోయాయి. నిధుల లేమితో కునారిల్లుతున్నాయి. కనీసం పారిశుధ్య పనులు నిర్వహించలేని దుస్థితి పల్లెల్లో నెలకొంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు నేటి వరకు పంచాయతీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయలేదు. నెలల తరబడి పాలక వర్గాలు ఆయా నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పంచాయతీలకు రూ.70.52 కోట్లు విడుదల చేయాలని సర్పంచ్ సంఘాల నేతలు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఇటీవల కలసి వినతిపత్రం కూడా అందజేశారు. అయినా ఇంతవరకు నిధులు విడుదల కాలేదు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు నేరుగా జమ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తొలుత కూటమి ప్రభుత్వం అమలు చేసింది. పంచాయతీలకు నవంబరులో రూ.70.04 కోట్లు విడుదల చేసి ఇచ్చిన హామీని నెలబెట్టుకుంది. ఇక ఇదే రీతిన నిధులు వస్తాయని సర్పంచ్‌లు ఆశించారు. అయితే వారి సంతోషం ఎక్కువ కాలం నిలువలేదు. రెండో విడత ఆర్థిక సంఘం నిధులు రూ.70.52 కోట్లను మూడు నెలల క్రితం (మిగతా 5లో)




గ్రామపంచాయతీ కార్యాలయం, రెంటచింతల

గుంటూరు సమీపంలోని పేరేచర్ల లేఅవుట్లో పునాదుల దశలోనే ఆగిపోయిన ఇళ్లు



కట్టుకోమన్నా.. కదలరు

గృహయోగం.. పేదల కల. ప్రభుత్వాల బాధ్యత. గత ప్రభుత్వం జగనన్న కాలనీలు అంటూ ప్రచారంతో సరిపెట్టింది. పదుల సంఖ్యలో కాలనీలు ఏర్పాటు చేసి వేలల్లో లబ్ధిదారులను ఎంపిక చేసింది. అయితే నిర్మాణాల గురించి విస్మరించడంతో ఆయా కాలనీలు చాలావరకు ఇళ్లు మొండిగోడలకే పరిమితమయ్యాయి. జగనన్న కాలనీలు అంటూ స్థల సేకరణ నుంచి చదును.. నిర్మాణాలు అంటూ అక్రమాలకు పాల్పడి పేదల ఇంటి కలను వమ్ము చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి 2,12, 474 ఇళ్లు గత ప్రభుత్వంలో మంజూరు కాగా వాటిలో నాలుగోవంతు అంటే 59,999 ఇళ్లు మాత్రమే పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దృష్టి సారించి చాలావరకు లబ్ధిదారులు నగదు లేక ఇళ్లు కట్టుకోలేకపోతున్నారని గుర్తించింది. అదనపు సహాయం చేసి ఇళ్లు పూర్తి చేయించాలని ప్రభుత్వం తలపెట్టి ప్రత్యేకంగా ఆర్థిక సాయం చేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. మూడు జిల్లాలో 41,396 మందికి అదనపు సహాయం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవగా 5 వేల మంది లోపు మాత్రమే ఇప్పటి వరకు ముందుకు వచ్చారు. వారు కూడా ఇళ్ల పనులు మొదలు పెట్టేందుకు సిద్ధంగా లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



జిల్లా	మంజూరు	పూర్తి	వివిధ దశల్లో	ప్రారంభించనవి
గుంటూరు	1,00,540	24,291	41,320	34,929
పల్నాడు	61,519	19,338	22,228	19,953
బాపట్ల	50,415	16,370	15,708	18,337

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి జగనన్న కాలనీలు, ప్రస్తుతం పీఎంఏవై ఎన్టీఆర్ నగర్లుగా మారాయి. గత ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇస్తామనడంతో వేలల్లో లబ్ధిదారులు ముందుకు వచ్చారు. అయితే నాటి ప్రభుత్వం స్థలం ఇస్తాం.. ఇల్లు కట్టుకోమనడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. దీంతో చాలావరకు ఇళ్ల నిర్మాణాలు మొండిగోడలకే పరిమితమయ్యాయి. నిధులు లేక, ప్రభుత్వం నుంచి సక్రమంగా బిల్లులు రాకపోవడంతో చాలామంది పనులను అసలే ప్రారంభించలేదు. ఈ పరిస్థితుల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మార్చిలో అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. దీంతో ఆగిపోయిన ఇళ్ల పనులు తిరిగి ప్రారంభమవుతాయని అందరూ భావించారు. కానీ ప్రభుత్వం అదనపు సహాయం అందించినా లబ్ధిదారుల నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడడంలేదు. గుంటూరు జిల్లా వరకు చూస్తే డిసెంబరు 10 నాటికి నిర్మాణ దశలో ఉన్న ఇళ్లలో 14,112 మందికి సహాయం మంజూరు చేసింది. జిల్లాలోని 6,530 మంది ఎస్సీ, 6,369 మంది బీసీలకు రూ.50 వేలు, 1,213 మంది ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అదనపు సహాయాన్ని మంజూరు చేసింది. మొత్తం 14,112 మందికి 1200 మంది మాత్రమే అదనపు సహాయాన్ని (మిగతా 5లో)

- ఎన్టీఆర్‌నగర్ ఇళ్లపై కనిపించని స్పందన
- అదనపు నిధులు ఇచ్చినా మొదలు పెట్టని వైనం
- మూడు జిల్లాలో 41,396 మందికి అదనపు సహాయం
- ఇప్పటి వరకు ముందుకు వచ్చింది 5 వేల మంది లోపే

18 ఏళ్ల సమస్యకు.. పరిష్కారం

- లింగంగుంట్ల భూములకు ఎట్టకేలకు రిజిస్ట్రేషన్ల అవకాశం
- పీఠాధిపతితో ఎంపీ లావు, ఎమ్మెల్యే అరవిందబాబు చర్చలు సఫలం
- పుష్పగిరి పీఠానికి నిర్ణీత ధర చెల్లిస్తే రిజిస్ట్రేషన్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మండలం లింగంగుంట్ల.. కాంగ్రెస్, వైసీపీ కంచుకోట. అయినా ఆ ప్రభుత్వాల హయాంలో ఆ గ్రామంలోని భూముల సమస్య పరిష్కారం కాలేదు. ఆ గ్రామంలో టీడీపీకి నామమాత్రంగా కూడా ఓటుబ్యాంకు లేదు. అయినా 18 ఏళ్లగా నెలకొన్న సమస్యను కూటమి ప్రభుత్వం శాశ్వతంగా పరిష్కరించింది. రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇవ్వడంతో భూముల విలువ కూడా పెరగనున్నది. లింగంగుంట్ల గ్రామంతో పాటు


లింగంగుంట్లలోని రహదారి

తరతరాలుగా రైతులు సాగు చేసుకుం టున్న సాగు భూములు పుష్పగిరి పీఠం ఆధీనం లో ఉన్నాయి. పీఠం నిర్వాహకులు కోర్టును ఆశ్ర యించడంతో భూ ములు పీఠానికి సంబంధించినవేనని తీర్పు చెప్పి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశించింది. దీంతో 2007 నుంచి గ్రామంలోని భూములకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. రైతులు దీక్షలు, ఆందోళనలు చేపట్టినా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యను పరిష్కరించలేదు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక అప్పటి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు పుష్పగిరి పీఠాధిపతితో చర్చలు జరపడంతో సమస్య పరిష్కారం చివరి దశకు వచ్చింది. 2019లో ప్రభుత్వం మార డంతో భూ సమస్య పరిష్కారం నిలిచిపో యింది. కూటమి అధికారంలోకి వచ్చాక పీఠాధిపతితో ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ అరవిందబాబు పలు దఫాలుగా జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో సాను కూలంగా స్పందించిన ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇచ్చింది. కాగా పీఠం ఆధీనంలో 1428 ఎకరాలు ఉన్నట్లుగా రెవెన్యూ శాఖ తేల్చింది. కమర్షియల్‌కు 20 శాతం, కమర్షియల్‌కు సమీపంలో ఉన్న భూములకు 18 శాతం, వ్యవసాయ భూములకు 13 శాతం రిజిస్ట్రేషన్ విలువపై చెల్లించేలా గ్రామ రైతుల కమిటీ, పుష్పగిరి పీఠాధిపతి మధ్య ఒప్పందం కుదిరింది. రెవెన్యూ సర్వేలో గుర్తించిన రైతులు సదరు రేటు ప్రకారం పీఠం బ్యాంకు ఖాతాకు డబ్బు జమ చేస్తే రిజిస్ట్రేషన్ చేసేలా కార్యాచరణ చేపట్టారు. ఈ మేరకు రైతులు కొంత మొత్తాన్ని ఎంపీ లావు, ఎమ్మెల్యే అరవింద బాబు సమక్షంలో కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో పీఠం ప్రతి నిధికి అందజేశారు. మొత్తం మీద భూముల రిజిస్ట్రేషన్ కు మార్గం సుగమం కావడంతో లింగంగుంట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ఆహార భద్రత దిశగా...

పరిశోధనలు చేపట్టాలి


- లాంఫాంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

లాంఫాం(తాడికొండ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత దిశగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టి అత్యుత్తమమైన రకాలను కనిపెట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు తెలిపారు. ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా లాంఫాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆడిటోరియంలో గురువారం వేడుకలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే దిశగా ఆలోచనలు చేపట్టాలన్నారు. ఎగుమతులకు అనుకూలమైన రకాలకు, సాంకేతికతను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరి బీ.రాజశేఖర్ మాట్లాడుతూ హరిత విప్లవం ఆధారితంగా రూపొందించిన సాంకేతికతపై ప్రస్తుత వ్యవసాయం ఆధారపడి ఉందని తెలిపారు. దాని నుంచి బయటకు వచ్చి పర్యావరణ సూత్రాలను ఉపయోగించి, అధిక దిగుబడిని సాధించే దిశగా పరిశోధనలు సాగాలని సూచించారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ అనేక ఆటుపోట్లు తట్టుకుని 62 ఏళ్లుగా దేశంలో ఒక మంచి నాణ్యమైన విద్యని, పరిశోధన ఫలితాలను అందించే విశ్వవిద్యాలయంగా నిలబడిందన్నారు. 24 మంది ఉత్తమ రైతులకు, 16 మంది శాస్త్రవేత్తలకు అవార్డులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం..

5.94 లక్షల మందికి

మూడు జిల్లాలకు రూ.891.46 కోట్లు విడుదల



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సూపర్ సిక్స్‌లో కీలక పథకం తల్లికి వందనం. ఈ పథకం అమలు కాదంటూ వైసీపీ చేసిన తప్పుడు ప్రచారానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం అమలు చేస్తామని తల్లులకు ఇచ్చిన హామీని అమలు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలలు తెరిచిన మొదటి రోజే తల్లికి వందనం అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో నిరూపించుకుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 5,94,313 మంది విద్యార్థులను అర్హులుగా ప్రకటించి 891,46,95,000 నగదును విడుదల చేసింది. తల్లులు 3,86,657 మంది పథకం కింద లబ్ధిపొందుతున్నారని అధికారులు ప్రకటించారు. కాగా పాఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ నిధికి, రూ.2000 మినహాయించి మిగిలిన రూ.13000 తల్లుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం విడుదల చేసింది. అయితే గురువారం రాత్రి వరకు డబ్బు జమ కాలేదని పలువురు తెలిపారు. శుక్రవారం అర్హులకు జమ అవుతుందని అధికారులు చెప్తున్నారు.

జిల్లాల వారీగా లబ్ధిదారుల సంఖ్య ఇలా ఉంది

జిలా	విద్యార్థులు	మొత్తం
పల్నాడు	2,47,393	371,08,95,000
బాపట్ల	1,45,009	217,51,35,000
గుంటూరు	2,01,911	302,86,65,000

బడిబాటలో..

అడుగులు

జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు గురువారం పునఃప్రారంభం అయ్యాయి. విద్యార్థులతో అంతా సందడి వాతావరణం నెలకొంది. కొత్త తరగతుల్లోకి సరికొత్త ఆలోచనలతో విద్యార్థులు అడుగుపెట్టారు. కొత్తగా పాఠశాలల్లో తమ చిన్నారులను చేర్పించేందుకు తల్లిదండ్రులు బడి బాట పట్టారు. అలాగే ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలకు ప్రమోషన్ పొందిన విద్యార్థులూ అడ్మిషన్లు తీసుకున్నారు.

-నరసరావుపేట(ఆంధ్రజ్యోతి)




నరసరావుపేటలో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మెహనకృష్ణ

కూటమి.. కోలాహలం

- జిల్లా అంతటా శ్రేణుల సందడి
- ఘనంగా ఏడాది పాలనా సంబరాలు
- పలు ప్రాంతాల్లో కేక్ కటింగ్.. కార్యక్రమాలు
- విమాన దుర్ఘటనతో మధ్యాహ్నం నుంచి ఆగిన వేడుకలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఏర్పడి గురువారానికి ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి ప్రజాప్రతినిధులు, నేతలు, శ్రేణుల్లో కోలాహలం నెలకొంది. ఏడాది పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరిస్తూ రాబోయే నాలుగేళ్లలో చేపట్టబోయే పనులకు హామీ ఇస్తూ ఏడాది పాలనా ఉత్సవాలను నేతలు ఘనంగా జరిపారు. ఎమ్మెల్యేలు, నేతల ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆయా నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి ఏడాది పాలనపై ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నేతలు, కార్యకర్తలతో పాటు మహిళలు, యువత ఆయా సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువారం మధ్యాహ్నం భారీగా కార్యక్రమాలకు నేతలు ప్రణాళిక రూపొందించుకోగా అహ్మదాబాద్‌లో విమాన దుర్ఘటనతో వాటిని వాయిదా వేసుకున్నారు.

- వినుకొండలోని టీడీపీ కార్యాలయంలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కేక్ కట్ చేశారు.
- నాదెండ్లలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించి రక్తదాతలను అభినందించారు.
- మాచర్లలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి భారీ కేక్‌ను కట్ చేశారు. స్థానిక వెంకటేశ్వరహాల్ సెంటర్‌లో అన్నదానం, విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు.
- క్రోసూరులో జరిగిన సంబరాల్లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని కేక్‌ను కట్ చేశారు.
- నరసరావుపేటలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.


వినుకొండ టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కనపర్తి శ్రీనివాసరావు


చిలకలూరిపేట పొట్టి శ్రీరాములు వీధిలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో నేతలతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


మాచర్లలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి


క్రోసూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

సద్బోధ

వైఫల్యాలను స్వీకరిద్దాం



మానవుడి ఎదుగుదల, పరిణామ క్రమంలో అనేకసార్లు వైఫల్యాలు ఎదురవడం సహజం. వైఫల్యం కచ్చితంగా మనల్ని కుంగదీస్తుంది. కొన్నిసార్లు మానసిక ఒత్తిడి నుంచి ఆత్మహత్య వరకూ... దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. కానీ వైఫల్యానికి ఒక సానుకూలమైన కోణం కూడా ఉంది. దాని నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. కొత్త ఆలోచనలు చేయవచ్చు. కొత్త ఆశలు చిగురింపజేసుకోవచ్చు. ఇవన్నీ మన ప్రయాణానికి కొత్త దిశను అందిస్తాయి.

సమస్యలు శత్రువులు కాదు....

మన జీవితాల్లో విజయం కన్నా వైఫల్యమే ఎక్కువ సార్లు ఎదురవుతుందనేది ఒక వాస్తవం. కాబట్టి, వైఫల్యాలకు కుంగిపోకుండా, వాటి నుంచి పాఠాలు నేర్చుకోవాలి, ముందుకి సాగుతూ ఉండాలి. మనం విఫలమైనప్పుడు... అంతకు ముందు చేసిన తప్పులు మళ్ళీ చెయ్యకుండా జాగ్రత్త పడాలి. మన తప్పుల నుంచి మనం నేర్చుకున్నంతకాలం... అవి మనకి ఎలాంటి హానీ చెయ్యలేవు. విజయవంతమైన వ్యక్తులు కూడా విఫలమైన వ్యక్తుల్లాగానే వైఫల్యాలు ఎదుర్కొంటూ ఉంటారనేది నమ్మడం కష్టమైనప్పటికీ అది వాస్తవం. కానీ తేడా ఏమిటంటే... వాళ్ళు తమను తాము మెరుగుపరుచుకొని, తమ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని ప్రగతి దిశగా ముందుకు సాగుతూ ఉంటారు. ఎందుకంటే విజయం అనేది వైఫల్యానికి అవతలి చివర్లో ఉంటుంది. విజేతలు తమ విజయంకోసం సాగించిన పయనంలో అనేకసార్లు విఫలమైనవారే. కానీ వాళ్ళు ఒక వైఫల్యంగా తమను ఎన్నటికీ పరిగణించుకోరు. మహా భక్తురాలు, కవయిత్రి మీరాబాయి ఒక రాణి. ఆమె భర్తను కోల్పోయిన తరువాత బంధువులు ఎంతగానో వేధించారు, హింసించారు. చిత్తోడ్‌గఢ్ రాజమందిరాన్ని విడిచి ఆమె బయటకు పోవాల్సి వచ్చింది. కానీ ఈ ప్రతికూలతను ఒక అవకాశంగా ఆమె మార్చుకుంది. బృందావనానికి వెళ్ళి, అక్కడే నివసిస్తూ ఆధ్యాత్మిక సంపదను పోగు చేసుకుంది. కాబట్టి గొప్పవారు తమకు ఎదురైన కష్టాలకు కుంగిపోరు. తమ అంతరంగాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఒక అవకాశంగా దాన్ని మలచుకుంటారు. సమస్యలు మనకు శత్రువులు కాదు. అవి నేర్చుకోవడానికి మనకు అనేక అవకాశాలు ఇస్తాయి. కొత్త దృక్పథంతో జీవితాన్ని చూసేలా చేస్తాయి. ఆత్మశోధనకు ఆస్కారం కల్పిస్తాయి. మనలో దాగి ఉన్న సామర్థ్యాలను బయటకు తీయడానికి దోహదం చేస్తాయి.

ఎదుగుదలే శాశ్వతం

"లోకహానౌ చింతా న కార్యా నివేదితాత్మ లోక వేద శీలత్వాత్... భక్తుడు తనను, ఈ లోకాన్ని, ఇక్కడ చేసే కర్మలను, తన ప్రవర్తనను... ఇలా అన్నిటినీ ఆ పరమాత్మకే సమర్పిస్తాడు. కాబట్టి అతను ఎటువంటి కష్టాలకు, దుఃఖాలకు చలించడు. వాటిలో దేవుడి కృపనే దర్శిస్తాడు" అన్నాడు నారద మహర్షి తన 'భక్తి సూత్రాల'లో. కష్టాల్లో కూడా దైవికమైన ఆశీర్వాదం అంతర్లీనంగా ఉందని నారద మహర్షి మనకు ఉపదేశిస్తున్నాడు. ప్రతికూలమైన పరిస్థితుల్లో మనం ప్రాపంచికమైన విషయాలకు దూరంగా జరుగుతాం. అలాంటి కష్ట సమయాల్లో భగవంతుణ్ణి మీ మనసులో స్మరించుకోండి. మీ ప్రవర్తనలను మార్చుకోవడానికి ప్రయత్నించండి. భౌతికమైన లక్ష్యాలను పెంచుకోవడం మన లక్ష్యం అయితే... ప్రతికూల పరిస్థితులను సహజంగానే ఎదుర్కోవలసి వస్తుంది. కానీ మనం ఆధ్యాత్మికమైన పురోగతిని కోరుకున్నప్పుడు... ప్రతికూలతలను ఎదుగుదలకు అవకాశాలుగా చూడడం నేర్చుకుంటాం. కష్టాల వల్ల కలిగే బాధ తాత్కాలికమని, వాటిని ఎదుర్కొని, పరిష్కరించుకోవడం ద్వారా మనలో సంభవించే ఎదుగుదల శాశ్వతమని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి.

• స్వామి ముక్తానంద
జేకేయోగ్ వ్యవస్థాపకుడు

దైవమార్గం

అంతరంగంతో వినాలి



మంచి ఉపమానాలతో, సామాన్యులకైనా చక్కగా అర్థమయ్యేలా హితవు చెప్పేవాడు ఏసుక్రీస్తు. ఆయన బోధల్లో వెల్లడించే ఎంతటి నిగూఢ సత్యమైనా సులువుగా అవగతమయ్యేది. అలాంటి కథల్లో ఇది ఒకటి. "ఆధ్యాత్మిక విషయాలు మామూలు చెవులతో వింటే గ్రహించడం కష్టం. వాటిని ఆత్మీయమైన అంతరంగంతో వినాలి" అంటూ ఈ కథను ఆయన ప్రారంభించాడు.

ఒక రైతు తన భూమిని దున్ని, విత్తనాలు చల్లడానికి సిద్ధమయ్యాడు. అతను విత్తనాలు చల్లుతూ ఉంటే... వాటిలో కొన్ని దారి పక్కన పడిపోయాయి. పక్షులు వచ్చి వాటిని మింగేశాయి. మరి కొన్ని మట్టి ఎక్కువగా లేని రాతి నేలలో పడ్డాయి. అవి ఎండకు మాడి పోయాయి. ఇంకొన్ని ముళ్ళ పొదల్లో పడ్డాయి. ఆ పొదలు వాటిని ఎదగనివ్వకుండా చేశాయి. మిగిలినవి సారవంతమైన నేల మీద పడ్డాయి. అవి ఒక్కొక్కటీ ముప్పై మొదలు నూరింతల వరకూ ఫలించాయి.

అలాగే ఒక వ్యక్తి ఎంతోమందికి నీతి సారాన్ని బోధిస్తున్నప్పటికీ... వాటిని గ్రహించే విషయంలో వ్యత్యాసాలు ఉంటాయి. అందరూ వాటిని వింటారు. కానీ కొందరి మనసుల్లో తిష్ట వేసుకొని ఉన్న చెడ్డ బుద్ధి వాటిని పక్కకు నెట్టేస్తుంది. దారి పక్కన పడిన విత్తనాలు అలాంటివే. మరి కొందరి మనసుసుల్లో ఆ మాటలు బాగా నాటుకోవు. అవి రాతి నేల మీద పడిన విత్తనాల్లాంటివి. ఇంకొందరు ఆ బోధలను విన్నప్పటికీ... ఐహిక బంధాలు, ధన వ్యామోహాలు వాటిని అణచివేస్తాయి. ఇవి ముళ్ల పొదల్లో పడిన విత్తనాలు. బోధను చక్కగా విని, వాటిని బాగా అర్థం చేసుకొని, పాటించేవారు కొందరు ఉంటారు. వారు సారవంతమైన నేలలో పడిన విత్తనాల్లా ప్రయోజకులవుతారు. అందరూ ఆ విధంగా కావాలనేది ఏసు ఆకాంక్ష.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

గీతాసారం



కోరికను, కోపాన్ని వదులుకోవాలంటే..

ప్రతి తుపానుకు దాని కేంద్రంలో ఒక ప్రశాంతమైన నేత్రం ఉంటుంది. అలాగే మన కోరికలు, కోపం అనే తుపానుకు కూడా... కోరికలు, క్రోధం లేని ఒక కేంద్రం మన మనసులోనే ఉంటుంది. ఆ కేంద్రాన్ని చేరుకోవడమే మోక్షం. ఈ ప్రక్రియలో... కోరికలకు మూల కారణమైన 'నేను' అనే భావనను తృణీకరించడానికి ఎంతో ధైర్యం కావాలి. రోజువారీ జీవితంలో ఈ విషయాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి రెండు సులభమైన పద్ధతులను పాటించవచ్చు. మొదటిది... గతంలో మనం కోరికతో నిండిన అవస్థను గాని, కోపం తెప్పించిన ఒక పరిస్థితిని గాని గుర్తుకు తెచ్చుకొని, ఒక సాక్షిగా గమనించాలి. 'అన్ని జీవుల్లో ఉన్న ఆత్మ ఒక్కటే. కానీ ప్రతి ఒక్కరూ ఒకే సత్యాన్ని అనేక విధాలుగా గ్రహిస్తారు' అనే మెరుగైన అవగాహనతో పరిస్థితిని విశ్లేషించాలి.

"కామ క్రోధ రహితులకు, చిత్తవృత్తులను జయించినవారికి, పరబ్రహ్మమైన పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందిన జ్ఞానులకూ అన్నిటిలోనూ ఆ పరమాత్మే గోచరిస్తాడు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. మరి 'కోరికలు' అనే వ్యాధి నుంచి, 'కోపం' అనే వెర్రితనం నుంచి స్వేచ్ఛ పొందడం ఎలా? భారతీయ సంప్రదాయాలు జీవితాన్ని 'లీల' అంటే 'కేవలం ఒక నాటకం' అని చెప్పాయి. అందులో ఏ విషయాన్నీ తీవ్రంగా పరిగణించవలసిన అవసరం లేదు. ఏడు నుంచి పది రోజుల పాటు మనం ఒక నాటకంలో నటిస్తున్నట్టు భావించి... దేన్నీ తీవ్రంగా తీసుకోకుండా... ఉల్లాస మనఃస్థితిలో ఉండడం అనేది రెండో మార్గం. ఇది ఒక నటుడు నాటకం కోసం కోరికను, కోపాన్ని అరువు తెచ్చుకొని, వాటిని అనుభూతి చెందడం లాంటిదే. ఒకసారి వాటిపై పట్టు సాధించిన తరువాత... మనం సుఖదుఃఖాల్లాంటి ఇంద్రియాల జాలంలో చిక్కినా కూడా... నెమ్మదిగా కోరికను, కోపాన్ని అప్పటికప్పుడే వదులుకోవడం నేర్చుకుంటాం. అంటే వర్తమానంలోనే పరమ స్వేచ్ఛను పొందడం, లేదా మోక్షాన్ని పొందడం ఎలాగో తెలుసుకుంటాం.

చివరి అడుగు పరమాత్మను శరణువేడడం. "భగవంతుడు యజ్ఞాలకు, తపస్సులకు భోక్త, సమస్త లోకాలకు, లోకేశ్వరులకు అధిపతి, సమస్త ప్రాణులకు ఆత్మీయుడు, అంటే అవ్యాజమైన దయ కలిగినవాడు, పరమ ప్రేమ స్వరూపుడు. ఈ భగవత్ తత్త్వాన్ని ఎరిగిన భక్తులకు పరమ శాంతి లభిస్తుంది" అని శ్రీకృష్ణుడు చెప్పాడు.




కె.శివప్రసాద్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఏపీ సీఎం చంద్రబాబుతో 15న సినీ ప్రముఖుల భేటీ

• పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఉండవల్లిలోని సీఎం నివాసానికి 30మంది



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఈ నెల 15న సమావేశం కాబోతున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు చిత్ర పరిశ్రమ తరపున దాదాపు 30మంది ప్రముఖులు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లనున్నారు. సినీ ఇండస్ట్రీ అభివృద్ధి, సినిమా థియేటర్ల నిర్వహణ, చిత్ర పరిశ్రమలోని సమస్యలు, తాజా పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా టాలీవుడ్ పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలవకపోవడంపై పవన్ అంతకుముందు అసహనం వ్యక్తం చేశారు. 'రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినందుకు థ్యాంక్స్' అంటూ డిప్యూటీ సీఎం చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇండస్ట్రీలో కలకలం సృష్టించాయి. సినీ నిర్మాతలు కేవలం తమ సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరల పెంపునకు మాత్రమే ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నారని, సినీ పరిశ్రమ అభివృద్ధికి సంఘటితంగా ప్రభుత్వం వద్దకు రావట్లేదన్నారు. ఇకపై వ్యక్తులు ఇచ్చే వినతుల్ని పట్టించుకోబోమని, అసోసియేషన్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని కూడా పవన్ ఆ సమయంలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పలువురు చిత్ర ప్రముఖులు పవన్ కల్యాణ్‌ను సంప్రదించి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నించారు. ముఖ్యమంత్రితో చర్చించి సినీ పరిశ్రమ అభివృద్ధికి అందరం పాటుపడదాం అని పవన్ సూచించడంతో చలన చిత్ర రంగ ప్రముఖులు చంద్రబాబుతో ఆదివారం భేటీ కానున్నారు.

-అమరావతి, (ఆంధ్రజ్యోతి)

వేడుకను విజయవంతం చేయండి

-దిల్ రాజు



పద్నాలుగు సంవత్సరాల తర్వాత నిర్వహిస్తోన్న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల వేడుకను విజయవంతం చేయాలని ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు కోరారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'విమాన ప్రమాద దుర్ఘటన కారణంగా మంత్రి కోమటిరెడ్డి ఈ కార్యక్రమానికి రాలేకపోయారు. ఈనెల 14న హైటెక్స్‌లో నిర్వహిస్తోన్న అవార్డుల బహూకరణ కార్యక్రమాన్ని ఐఅండ్‌పీఆర్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఉత్తమ చిత్రానికి హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాతలకు కలిపి నాలుగు అవార్డులను ప్రదానం చేస్తున్నాం. ఇలా ప్రతి ఏడాదిలో మూడు ఉత్తమ చిత్రాలకు అందజేస్తున్నాం. 2024 సంవత్సరానికి ప్రకటించిన అన్ని అవార్డులను కూడా ఇస్తున్నాం' అని దిల్ రాజు తెలిపారు.

అద్భుతమైన ఓపెనింగ్స్ వస్తాయనే నమ్మకం ఉంది


- సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్



'ఓ అపర కుబేరుడు, బిచ్చగాడికి మధ్య ఇంటిలిజెన్స్ మైండ్ గేమ్ నేపథ్యంలో సాగే చిత్రం 'కుబేర'. అసలు వారిద్దరూ ఒకరికొకరు ఎలా తారసపడ్డారు, వారి మధ్య పోరుకు దారి తీసిన పరిస్థితులు ఏమిటి? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న హిందీలో కూడా పాపులర్ స్టార్స్. అందుకే మా చిత్రాన్ని హిందీలో కూడా డబ్ చేసి విడుదల చేస్తున్నాం. మొత్తం 1600కు పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నాం. అద్భుతమైన ఓపెనింగ్స్ వస్తాయనే నమ్మకం ఉంది' అని నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు అన్నారు. వారిద్దరూ నిర్మాతలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'కుబేర' చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వారిద్దరూ మీడియాతో ముచ్చటించారు.

- శేఖర్ కమ్ముల మాకు చాలా ఇష్టమైన డైరెక్టర్. ఆయన మంచి ఎమోషన్స్‌తో ఆడియన్స్‌ని టచ్ చేస్తూ ఉండే సినిమాలు తీస్తారు. 'లవ్ స్టోరీ' చిత్రం తర్వాత శేఖర్ కమ్ముల 'కుబేర' కథను మాకు చెప్పారు. తర్వాత ధనుష్ కూడా ఓకే చేయడంతో సినిమా మొదలుపెట్టాం. 'కుబేర' సినిమా అద్భుతంగా వచ్చింది. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులు కలబోసిన చిత్రం ఇది. ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది.
- తన గత చిత్రాలకు భిన్నంగా ఈ సారి అగ్రతారలతో శేఖర్ ఈ సినిమాను తెరకెక్కించారు. ఇదొక డిఫరెంట్ మూవీ. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. సినిమాలో అధికభాగం రియల్ లోకేషన్లలో చిత్రీకరించడం సవాల్‌గా అనిపించింది. ముంబైలోని మురికివాడలు, డంపింగ్ యార్డ్స్‌లో చిత్రీకరణ జరిపాం. ఇందులో ధనుష్ బిచ్చగాడిగా సాహసోపేతమైన పాత్రలో నటించారు. ఆయన ఆహార్యం, లుక్, భాష, ఎమోషన్స్ బాగా కుదిరాయి. ధనుష్‌ను తప్ప ఈ పాత్రలో మరొకర్ని ఊహించుకోలేం. ఈ చిత్రంలో ధనుష్ రెండు పాటలు పాడారు. దేవిశ్రీ నేపథ్య సంగీతం సినిమాకు ప్రత్యేకాకర్షణ. నాగార్జున అభినయం ప్రధానాకర్షణగా నిలుస్తుంది. శేఖర్ కమ్ములతో మరో సినిమా చేస్తున్నాం.

యుద్ధభూమిలో యోధుడు



గోపీచంద్ కథానాయకుడిగా సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో చారిత్రక నేపథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'గోపీచంద్ 33-వర్కింగ్ టైటిల్'. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో రూపొందించిన భారీసెట్లో చిత్రీకరణ జరుగుతోంది. గోపీచంద్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం చిత్ర బృందం పోస్టర్‌ను, గ్లింప్స్‌ను విడుదల చేసింది. గోపీచంద్ విభిన్నమైన లుక్‌లో కనిపించారు. యుద్ధభూమిలో వీరతిలకం ధరించిన యోధుడిగా ఆయన కనిపించారు. ఏడో శతాబ్దానికి చెందిన ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని ఓ పాయింట్‌తో సంకల్ప్‌రెడ్డి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని యూనిట్ తెలిపింది.

గద్దర్ ఫిల్మ్ అవార్డులను తక్షణమే నిలిపివేయాలి

గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఆపాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించామని తెలంగాణ సినిమా వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రఫూల్ రాంరెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఆంధ్రా సినిమాలకు ఇవ్వవద్దని హైకోర్టులో పిటిషన్ వేశామని, శుక్రవారం వాదనలు వినిపించబోతున్నామని వారు చెప్పారు. కోర్టు ద్వారా తెలంగాణ సినిమాకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు.

-బర్కత్‌పుర, (ఆంధ్రజ్యోతి)

సీనియర్ నిర్మాత మహేంద్ర కన్నుమూత



తెలుగు చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటు చేసుకుంది. దర్శకుడు రవికుమార్ చౌదరి మరణించిన 24 గంటలు కాకముందే సీనియర్ నిర్మాత, ఎ.ఎ.ఆర్ట్స్ అధినేత కావూరి మహేంద్ర(79) గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా గుండె సంబంధమైన సమస్యలతో బాధపడుతున్న మహేంద్ర తన స్వస్థలమైన గుంటూరులోని రమేశ్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. నటుడు, నిర్మాత మాదాల రవి ఆయనకు అల్లుడు. కుమారుడు జీతూ కొన్నేళ్ల క్రితమే మరణించారు. ప్రొడక్షన్ మేనేజర్‌గా కెరీర్ ప్రారంభించిన మహేంద్ర తర్వాత నిర్మాణరంగంలోకి ప్రవేశించి గీతా ఆర్ట్ పిక్చర్స్, ఎ.ఎ. ఆర్ట్స్ బేనర్లపై 36 చిత్రాలు నిర్మించారు. 1977లో వచ్చిన 'ప్రేమించి పెళ్లి చేసుకో' నిర్మాతగా మహేంద్ర తొలి సినిమా. రాజశేఖర్ హీరోగా నటించిన 'అర్జున' ఆయన చివరి చిత్రం.

మిత్రమండలి వినోదం



ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన తారాగణంగా తెరకెక్కుతోన్న చిత్రం 'మిత్రమండలి'. నిహారిక ఎన్.ఎం కథానాయిక. విజయేందర్ ఎస్. దర్శకత్వంలో కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. నిర్మాత బన్నీ వాసు, బీవీ వర్క్స్‌తో కలసి సమర్పిస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ 'మిత్రమండలి' టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బన్నీ వాసు సమర్పిస్తున్న తొలి చిత్రం ఇది. టీజర్ చాలా బావుంది. దర్శకుడిలో ఎంతో ప్రతిభ ఉందని అర్థమవుతోంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. బన్నీ వాసు మాట్లాడుతూ 'వినోదాత్మకంగా, ఉల్లాసంగా సాగే నలుగురు స్నేహితుల కథ ఇది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం. థియేటర్లకు వచ్చి మనస్ఫూర్తిగా నవ్వుకోండి' అన్నారు. 'ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే కంటెంట్‌తో వస్తున్నాం' అని విజయేందర్ ఎస్. అన్నారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే చిత్రమిదని నిర్మాతలు తెలిపారు.

ఏడాదిలో 70 శాతం హామీల అమలు

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో గుంటూరులోని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు నివాసంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జీవీ, మక్కెన మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని, 70శాతం హామీలు అమలు చేసి రికార్డు సృష్టించినట్లు పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లోని ప్రతి పథకాన్ని అమలు చేస్తూ.. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నామన్నారు. తల్లికి వందనం అమలు చేశామని, ఆగస్టులో ఉచిత బస్సు ప్రయాణం, క్రమం తప్పకుండా పెన్షన్లు పంపిణీ, దీపం- 2 పథకం వంటి ప్రతి హామీని అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. రాజధాని అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి జగన్ పేటీఎం బ్యాచ్ విద్వేషాలు, విధ్వంసాలు సృష్టించేందుకు మహిళలపై దాడులకు దిగడాన్ని ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విధ్వంసకారులను ప్రభుత్వం వదిలే ప్రసక్తే లేదని జీవీ హెచ్చరించారు. గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, చింతా శ్రీనివాసరావు, ముక్కపాటి రవికుమార్ బైరపనేని శ్రీనివాసరావు, మారాసు రామయ్య, నలబోతు రామ కోటేశ్వరరావు, నర్రా రామకృష్ణ వాసిరెడ్డి, రవిచంద్ర పాల్గొన్నారు.

జంట హత్యల కేసులో.. పోలీసు విచారణకు అనుమతి

మాచర్లటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు జంట హత్యల కేసులో నిందితులను విచారించేందుకు వెల్దుర్తి పోలీసులు మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ ఈ నెల 16, 17 తేదీల్లో పోలీసు విచారణకు అనుమతినిచ్చారు. జంట హత్యల కేసులో ఇప్పటికే ఆరుగురు నిందితులు అరెస్టయి.. రిమాండ్‌లో ఉన్నారు. పోలీసుల విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి రానున్నాయి.

ఒంటరి మహిళ మెడలోని చైనే టార్గెట్

● నిందితుడి అరెస్టు.. ● 128 గ్రాముల బంగారం రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్

మాచర్లటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో ఇటీవల మహిళ మెడలో బంగారు చైను అపహరణకు పాల్పడ్డ యువకుడు షేక్ జానిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, ఆయన వివరాలు వెల్లడించారు. గురజాలకు చెందిన షేక్ జాని దొంగతనాలకు అలవాటుపడి మాచర్ల పట్టణంలో ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకొని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిపారు. నాలుగు కేసుల్లో అతను నిందితుడని చెప్పారు. జానీ అపహరించిన 128 గ్రాముల బంగారం విలువ సుమారు రూ. 10.24 లక్షలు ఉంటుందని తెలిపారు. సొమ్ము రికవరీ చేసి, కోర్టులో హాజరుపరుచనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ సీఐ పి.ప్రభాకరరావు, ఎస్ఐలు వెంకటరమణ, సంధ్యారాణిని అభినందించారు.

నెలాఖరులోపు పసుపు రైతులకు పరిహారం

● కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని, అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో సంభవించిన అగ్ని ప్రమాదం వల్ల నష్టపోయిన పసుపు రైతులకు ఈ నెలాఖరుకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఈ అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీకి న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ నుంచి ప్రమాద బీమా నగదు అందిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా పసుపు నిల్వచేసిన 294 మంది రైతులకు నగదు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఇన్సూరెన్స్ కంపెనీకి అవసరమైన అన్ని డాక్యుమెంట్లు అందించడం జరిగిందన్నారు. వారంలోపు ప్రమాద బీమాను కంపెనీ మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. విజయవాడలోని మార్క్‌ఫెడ్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో చేసుకొన్న ఒప్పందం ప్రకారం ఒక బస్తా పసుపునకు రూ.7 వేల చొప్పున బాధిత రైతులకు పరిహారం అందించేందుకు వీలుగా అవసరమైన నగదు సమకూర్చుకోవాలని, బాధిత రైతులకు నష్టపరిహారం వివరాల స్లిప్పులను వెంటనే అందించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ బీమా పరిహారం నగదు జమ అయిన వెంటనే బాధిత రైతులకు పంపిణీ చేసేందుకు వీలుగా ఇప్పటికే జాయింట్ అకౌంట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ సురేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు, మార్కెటింగ్ శాఖ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, ఏడీలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకానికి దొంగ బిల్లులు పెట్టిన వైసీపీ

● ఆడిట్‌లో అడ్డంగా దొరికిన వైసీపీ నాయకులు

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): 'దొంగ బిల్లులతో కేంద్ర ప్రభుత్వాన్ని మభ్యపెట్టి గత రాష్ట్ర ప్రభుత్వం కాజేసిన రూ.250 కోట్లు ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. కేంద్ర పథకాలకు కొత్తగా నిధులు మంజూరు చేయాలంటే తప్పుడు పద్ధతుల్లో కాజేసిన ఆ నగదు కట్టాలని కేంద్రం చెబుతోంది.' అని కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కార్యాలయంలో గురువారం జరిగిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల పాలనకు, కూటమి పాలనకు తేడా ప్రజలు గమనించాలని కోరారు. జగన్ పాలనలో అభివృద్ధి నిర్వీర్యం అయిందే తప్ప ఎక్కడా ప్రజా సంక్షేమం జరగలేదన్నారు. సంక్షేమం పేరుతో పొద్దునే డబ్బులు ఇచ్చి సాయంత్రానికి వసూలు చేసుకునే కార్యక్రమం తప్ప ఏమీ లేదని దుయ్యబట్టారు. ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం ద్వారా ముస్లిం మైనారిటీలకు సౌకర్యాలు కల్పించవచ్చని తెలిసి, దానిపై తాను విచారించగా.. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకం బయట పడిందని పెమ్మసాని తెలిపారు. 2014- 19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనుల్లో 80 పనులు తాము పూర్తిచేశామని వైసీపీ ప్రభుత్వం బిల్లులు వసూలు చేసిందని పేర్కొన్నారు. ఆడిట్లో ఈ అవకతవకలు బయటపడ్డాయన్నారు. దీనిపై వైసీపీ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి వచ్చి ముస్లింలకు దక్కాల్సిన నిధులను కూడా పక్కదారి పట్టించారని ఆరోపించారు. గడిచిన ఐదేళ్లలో బటన్ నొక్కుడు కార్యక్రమం కాకుండా ముస్లింలకు ఏం చేశారని ప్రశ్నించారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో పదేళ్ల నుంచి ఆగిపోయిన భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. దక్కన్ టొబాకో వారితో మాట్లాడి ఎమ్మెల్యే నసీర్ ఆర్థో ట్రామా వంటి ఎన్నో సౌకర్యాలు జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఏడాదిలో గుంటూరు నగరంలో అభివృద్ధిలో కూటమి మార్క్ స్పష్టంగా కనిపించిందన్నారు. ఏ మూలకు వెళ్లినా రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని, ఈ ఐదేళ్లలలో గుంటూరు తూర్పు స్వరూపమే మారిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాజా మాస్టారు, డిప్యూటీ మేయర్ సజీల, నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'కన్నప్ప' సెన్సార్ కాకముందే.. విడుదల తేదీ ప్రకటనా?

● మంత్రి సత్యకుమార్‌కు బ్రాహ్మణ చైతన్య వేదిక ఫిర్యాదు



మంత్రికి ఫిర్యాదు అందజేస్తున్న బ్రాహ్మణ చైతన్య వేదిక నేతలు

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కన్నప్ప సినిమా ఇంకా సెన్సార్ సర్టిఫికెట్ పొందకుండానే విడుదల తేదీని ప్రకటించడంపై బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ, ఏపీ అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి ఆక్షేపించారు. గురువారం మధ్యాహ్నం గుంటూరు నగరానికి వచ్చిన రాష్ట్ర వైద్య విద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని బ్రాహ్మణ చైతన్య వేదిక, అర్చక సేవా సంఘం, సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ, హిందూ దేవాలయాల ధర్మ పరిరక్షణ సమితి నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. మంచు మోహన్ బాబు నిర్మించిన కన్నప్ప సినిమాలో సనాతన ధర్మాన్ని కించపరిచి, బ్రాహ్మణ ఆచార వ్యవహారాల్లో ఒక భాగమైన శిఖను పిలక గిలక అనే పాత్రలు సృష్టించి బ్రాహ్మణ సమాజాన్ని అవమానించారని పేర్కొన్నారు. హైకోర్టులో తాము రిట్ పిటిషన్ వేశామని, కేస్ పెండింగ్‌లో ఉండగా, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకుండానే తేదీ ప్రకటించారని ఇది ఎలా సాధ్యపడుతుందని శ్రీధర్ ప్రశ్నించారు. సనాతన ధర్మ పరిరక్షణకు విఘాతం కలిగించే కన్నప్ప సినిమాలోని సన్నివేశాలు తొలగించేలా ఫిలిం సెన్సార్ బోర్డు రీజనల్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేయాలని శ్రీధర్ కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో అందరి మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత సినిమా వారికి ఉందని, తాము బ్రాహ్మణ సమాజానికి అండగా ఉంటామన్నారు. కన్నప్ప సినిమా పైన చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. దర్శనపు శ్రీనివాస్, ఐలూరు శ్రీనివాస్, యనమదల ఆంజనేయులు, ఎండపల్లి శబరి, చిలుమూరు ఫణి, వేదాంతం లక్ష్మణ్ ఉన్నారు.

వృద్ధాప్యం.. అనారోగ్యం

బాపట్లలో అన్నదమ్ముల ఆత్మహత్య



బొడ్డుపల్లి వెంకట సుబ్బయ్యశాస్త్రి, బాల సుబ్రహ్మణ్యం(ఫైల్‌ఫొటో)

బాపట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆరుపదుల వయస్సుదాటింది. అవివాహితులైన సోదరులు గత కొంతకాలంగా అనారోగ్యంతో అవస్థలు పడుతున్నారు. చూసేవారు లేరు. దీంతో ఏమనుకున్నారో ఏమో ఇద్దరూ కలిసి తనువు చాలించారు. విషాదం ఏమిటంటే ఇంతకాలం వారి వెన్నంటి ఉన్న రెండు కుక్కలు కూడా మృతి చెందాయి. నాలుగైదు రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించి పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపిన వివరాలు.. బాపట్లలోని శిఖరంవారి వీధిలో అన్నదమ్ములైన బొడ్డుపల్లి వెంకటసుబ్బయ్య శాస్త్రి(65), డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం(63) నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ పెళ్లి చేసుకోలేదు. వారు నివాసం ఉంటున్న ఇంటి నుంచి గురువారం సాయంత్రం దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ రాంబాబు సిబ్బందితో వచ్చి ఇంటిని పరిశీలించారు. ఇంట్లో సోదరుల మృతదేహాలను గుర్తించారు. నాలుగైదు రోజుల క్రితం వారిద్దరూ ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు తెలిపారు. ఆహారంలో ఏదైనా పురుగుల మందు కలుపుకు తిని ఉంటారని మృతదేహాల పరిస్థితిని బట్టి అనుమానిస్తున్నారు. ఆ సమీపంలోనే రెండు కుక్కలు కూడా చనిపోయి ఉన్నాయి. వారు తినిన ఆహార పదార్థాలను కుక్కలు కూడా తిని చనిపోయి ఉంటాయని పోలీసులు అనుమానం. ఈ ప్రాంతంలోనే బాలసుబ్రహ్మణ్యం సుదీర్ఘకాలం దంత వైద్యుడిగా సేవలందించారు. గత కొంతకాలంగా సోదరులు అనారోగ్యంతో బాధపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అనారోగ్య సమస్యతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పలువురు పేర్కొంటున్నారు. గుంటూరులోని బంధువులకు సమాచారం ఇచ్చామని పోలీసులు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

పరిశీలనకు వచ్చి..రూ.15 లక్షలు ఇచ్చారు



పరిశీలిస్తున్న డాక్టర్ అమర్నాథ్

గుంటూరు (మెడికల్)జూన్ 12(ఆంధ్రజ్యోతి): దేశం దాటి వెళ్లినా చదువుకున్న కళాశాలను, అనుభవాన్ని పంచిన ఆసుపత్రిని మరువలేదు డాక్టర్ కొమ్మూరి అమర్నాథ్. బాపట్లకు చెందిన ఆయన 1997లో గుంటూరు మెడికల్ కాలేజ్‌లో డాక్టర్ పట్టా పొందారు. ప్రస్తుతం అమెరికాలో కార్డియాలజిస్ట్‌గా స్థిరపడ్డారు. గురువారం జీజీహెచ్‌ను సందర్శించిన డాక్టర్ అమర్నాథ్ కొన్ని విభాగాలను పరిశీలించారు. ఫిజియాలజీ విభాగంలో సమస్యలను సిబ్బంది చెప్పడం తో మరమ్మతుల నిమిత్తం రూ.15 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. డాక్టర్ అమర్నాథ్ స్పందనపై జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ హర్షం వ్యక్తం చేశారు.

కట్టుకోమన్నా.. కదలరు

(3వ పేజీ తరువాయి)

పొందారు. పల్నాడు జిల్లాలో 14,106మందికి రూ.75.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. బాపట్ల జిల్లాలో 13,178 మందికి అదనపు సహాయాన్ని కేటాయించారు. ప్రభుత్వం అదనపు సహాయం ప్రకటించి ఇప్పటికి 3 నెలలు అవుతున్నా 2,600 మంది మాత్రమే తొలివిడత సహాయం పొందారు. కాగా వారిలో 300 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టారు.

సహాయం ఇస్తున్నా స్పందన కరువు

గత ముఖ్యమంత్రి పేదలకు ఇళ్లు కట్టిస్తానని చెప్పి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎంఏవై, ఇతర స్కీముల ద్వారా వచ్చే రూ.1.80 లక్షలు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇచ్చింది లేదు. ఆ నగదు ఇళ్లు కట్టుకునేందుకు సరిపోక అప్పులు తెచ్చుకుని నిర్మాణం కొనసాగించారు. అవీ చాలక చివరికి ఇళ్ల నిర్మాణం ఆపేసుకున్నారు. అలాంటి వారి కోసం ప్రభుత్వం అదనపు సహాయాన్ని ప్రకటించింది. కానీ పనులు పూర్తి చేసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

మౌలిక సదుపాయాల లేమే కారణమా?

గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున స్థలాలు ఇచ్చింది. అలా ఇచ్చిన స్థలాల్లో మెజారిటీ స్థలాలు జనావాసాలకు దూరంగా, లోతట్టు ప్రాంతాల్లో ఇచ్చింది. దీంతో అక్కడ మౌలిక సదుపాయాల సమస్య తీవ్రంగా ఉంది. వర్షాకాలం వస్తే మోకాలి లోతు బురదలో కాలనీలు కూరుకుపోతున్నాయి. అడుగు తీసి అడుగు వేయడమే దుర్భరంగా మారిపోతోంది. దీంతో చాలామంది ఆ స్థలాల్లో ఇళ్లు కట్టుకునేందుకు సుముఖంగా లేరు.

పంచాయతీల్లో.. పైసలు లేవు

(3వ పేజీ తరువాయి)

విడుదల చేసింది. పల్నాడు జిల్లాకు రూ.30.78 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.23.35 కోట్లు, గుంటూరు జిల్లాకు రూ.16.39 కోట్లు పంచాయతీల బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాల్సి ఉన్నా ఆ ఊసే మరిచింది.

నిధులు విడుదలతోనే వెసులుబాటు

వర్షాకాలం మొదలైంది. అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న హెచ్చరికలున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నిధులు లేక ఎటువంటి పనులు చేయలని పరిస్థితుల్లో పంచాయతీ పాలక వర్గాలు ఉన్నాయి. నిధులు విడుదల చేస్తే ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారులు వంటి పనులకు వెసులుబాటు ఉంటుందని సర్పంచ్‌లు తెలుపుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

46,207 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 44,402 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,207 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,136 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13500	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	12500	334	9500	13600
273	10000	12500	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	----	-----
4884	---	---	341	10000	14000
సూపర్ 10	---	---	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14300	తేజ	10000	14500
షార్క్-1	------	------	బ్యాడిగి	10000	13400
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

ఎయిమ్స్‌లో కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్

● పెమ్మసాని చొరవతో త్వరలో..

మంగళగిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్‌లో కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ సెంటరు అందుబాటులోకి రానుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎయిమ్స్ ఆసుపత్రిని పరిశీలించారు. ఎయిమ్స్‌లో కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ సెంటరు అవసరమని వైద్యాధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండడంతో జిల్లా వైద్యాధికారుల దృష్టికి మంత్రి పెమ్మసాని తీసుకువెళ్లారు. జిల్లా వైద్య శాఖ బృందం ఎయిమ్స్‌లో పరిశీలన జరిపి.. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన మంత్రి పెమ్మసాని ఎయిమ్స్‌లో కార్నియా మార్పిడి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. ఈ సౌకర్యంతో గుంటూరు జిల్లాతో పాటు మూడు జిల్లాల కంటి సమస్య బాధితులకు ఊరట లభించనుంది.

లారీ ఢీకొని.. వాహన చోదకుడి మృతి

తెనాలి, మారీసుపేట,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీ కొని వాహన చోదకుడు మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. త్రీటౌన్ ఎస్సై షేక్ కరిముల్లా వివరాల మేరకు.. మండలంలోని కోపల్లెకు చెందిన కారుమంచి దేవదానం (70) పట్టణంలో ఒక కార్యక్రమానికి తన ద్విచక్రవాహనంపై వచ్చారు. తిరుగు ప్రయాణంలో సుల్తానాబాదులో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దేవదానం ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరిముల్లా తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే క్రైస్తవ సమాజానికి మేలు



పొన్నూరుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే క్రైస్తవ సమాజానికి మేలు జరుగుతుందని, ఏడాది పాలనతో అది రుజువైందని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ మోసిగంటి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 25 శాతం ఉన్న క్రైస్తవుల సమాజానికి కూటమి ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుందని కొనియాడారు. జగన్‌రెడ్డి తమ వాడు అనుకుని 98 శాతం మంది క్రైస్తవులు సహకరించి, గెలిపిస్తే క్రైస్తవులను వంచించారని ఆరోపించారు. జగన్‌రెడ్డి పాస్టర్‌ల వివాహ లైసెన్స్‌ల జారీ కాలాన్ని మూడేళ్లకు కుదిస్తే కూటమి ప్రభుత్వం పదేళ్లకు కొనసాగించిందన్నారు. 12 వేల ఎయిడెడ్ స్కూల్స్‌ను గత ప్రభుత్వం మూసి వేస్తే.. మంత్రి లోకేష్ దానిపై విచారణ జరుపుతున్నారన్నారు. క్రిస్మస్ పండుగను ప్రభుత్వమే రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడానికి ప్రతి జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు కేటాయించారని గుర్తుచేశారు. టీడీపీ కార్యాలయంలో ఏటా క్రిస్మస్ పండుగను నిర్వహిస్తారని వైసీపీ కార్యాలయంలో ఎందుకు జరపరని ప్రశ్నించారు. క్రైస్తవ స్మశాన వాటికలకు స్థలాల సేకరణ కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అర్చకులు, ఇమామ్‌లతో పాటు పాస్టర్‌లకు రూ.30 కోట్లు గౌరవ వేతనాలు ఇచ్చారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో చర్చిల మరమ్మతులకు నిధులు కానీ, క్రైస్తవుల ఉపాధి కోసం ఎన్బీడీ రుణాలు కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదన్నారు. విద్యావంతులైన వారికి చైర్మన్, అడ్వైజరీ పదవులు ఇవ్వడం ద్వారా క్రైస్తవులకు మరింత మేలు జరుగుతుందని జోసెఫ్ మోసిగంటి ప్రభుత్వాన్ని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దాచేపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవికుమార్ గురువారం తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వేమవరం సంగం డెయిరీ అధ్యక్షుడిగా జాన్‌సాహెబ్



మాచవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేమవరం సంగం డెయిరీ అధ్యక్షుడిగా మూమిన్ జాన్ సాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన నారబోశెట్టి నారయ్య పదవీ కాలం పూర్తవ్వటంతో నూతన అధ్యక్షుడిగా జాన్‌సాహెబ్‌ను ఎన్నుకున్నారు. జే సాయితేజ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ప్రజలు సంతృప్తి

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలో ప్రజలు సంతృప్తిగా వున్నారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 142 హామీలను నెరవేర్చిందని, ముఖ్యంగా పెన్షన్ పెంపు 4వేలు, దివ్యాంగుల పెన్షన్ రెట్టింపు, 204 అన్న క్యాంటీన్లు ప్రారంభం, మెగా డీఎస్సీకి చర్యలు, దీపం పథకం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు తదితర హామీలను నెరవేర్చిందని గుర్తుచేశారు. గురజాల నియోజకవర్గంలో రూ.కోటి 60 లక్షలకు పైగా సీఎం సహాయనిధి కింద చెక్కుల పంపిణీ జరిగిందని, ఏడాది కాలంలో తాగునీటికి రూ.300కోట్లకు పైగా నిధుల కేటాయింపు, సుమారు 5కోట్లతో రహదారి మరమ్మతులు పూర్తిచేయడం, జానపాడు రోడ్డులో ఆర్‌ఓబీ శంకుస్థాపన, పట్టణ ప్రధాన రహదారులు, బైపాస్‌పై సెంట్రల్ లైటింగ్‌కు నిధులు మంజూరయ్యాయన్నారు. గురజాల, దాచేపల్లి పట్టణ పరిధిలో కూడా తాగునీటికి, రహదారుల ఏర్పాటుకు నిధులు కేటాయించామని యరపతినేని తెలిపారు. ఇవన్నీ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో జరిగాయని యరపతినేని గుర్తు చేశారు.

బాలకార్మికులు విద్యనభ్యసించేలా చేయాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌కళ్యాణ్

మాచర్ల రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు బాలకార్మికులుగా టీస్టాల్స్ దుకాణాల్లో పనిచేయడం దారుణమని, అటువంటి వారిని గుర్తించి తప్పనిసరిగా విద్యనభ్యసించేలా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస కళ్యాణ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కోర్టులో మండల న్యాయ సేవా కమిటి ఆధ్వర్యాన నిరాశ్రయులైన పిల్లలు, బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 18 యేళ్లలోపు అనాధ పిల్లలకు జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు అందజేయాలని సూచించారు. రాష్ట్ర న్యాయసేవ అధారిటీ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబడుతుందని, ఎవరైనా పత్రాలు, అధారు కార్డులోని పద్దెనిమిదేళ్లలోపు పిల్లలు స్థానిక సంఘానికి, ఆశా కార్యకర్తలను గానీ సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి.వెంకటేశ్వర్లు, మాచర్ల న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు వై రమేష్, ఉపాధ్యక్షుడు షేక్ గౌస్‌బాషా, అంగన్‌వాడీ, పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు, ఎంఈవోలు, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దాచేపల్లి తహసీల్దార్‌గా శ్రీనివాస యాదవ్

దాచేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి తహసీల్దార్‌గా శ్రీనివాస యాదవ్ గురవారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ సమస్యలు వేగంగా పరిష్కరిస్తూ ప్రజలకు సేవలందిస్తామని శ్రీనివాస్ వివరించారు.

9వ మహాసభను జయప్రదం చేయాలి

దాచేపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సీపీఐ 9వ మహాసభ జయప్రదం చేయాలని గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి కోరారు. గురువారం దాచేపల్లి నగర పంచాయతీ, నారాయణపురంలో సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఈ మహాసభ జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కమ్యూనిటీ హాల్‌లో సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కొమరి వెంకటరావు, యడ్ల భాస్కర్, పత్తిపాటి వెంకట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

5,700 మిర్చి టిక్కీల అమ్మకం

దాచేపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం 6,400 మిర్చి టిక్కీలు రాగా 5,700 టిక్కీల అమ్మకం జరిగాయి. 334 రకం రూ 8వేలు నుంచి రూ 12,500, తేజా రకం రూ 9వేలు నుంచి రూ 14వేలు, తాలుగాయలు రూ 2వేల నుంచి రూ 7వేలు అమ్మకాలు జరిగాయి.

నేడు జాబ్ మేళా

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 13వ తేదీ ఉదయం పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కొండవీటి పద్మ గురువారం విలేకరులకు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఫార్మసీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. పలు కంపెనీలు జాబ్ మేళాకు హాజరవుతాయన్నారు. ఇంటర్వ్యూకు హాజరు కాదలచినవారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, జిరాక్స్‌లు, ఆధార్ నకలు, పాసు ఫోర్టు సైజు ఫోటోతో రావాలని తెలిపారు.

18 లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

రాజుపాలెం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీన అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలలో ప్రభుత్వం నగదు జమ చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకట నరసయ్య తెలిపారు. ఈ పథకం కింద రైతుల ఖాతాలలో నగదు జమ కావాలంటే ఈ నెల 18వ తేదీలోపు రైతులందరూ వారి పొలం ఉన్న గ్రామాలలోని రైతు సేవా కేంద్రం వద్ద ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

● నకరికల్లు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించు కోవాలని ఏవో దేవదాసు కోరారు. ప్రభుత్వ పథకాల కోసం ఈకేవైసీ తప్పనిసరి అన్నారు.

ఆయుర్వేద వైద్యశాలను నిర్మించాలి

నకరికల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నకరికల్లులో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల శిథిలావస్థకు చేరిందని, దీనిని నూతనంగా నిర్మించాలని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కొండారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గిరిజన నాయకుడు కోటానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

పెదకూరపాడు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చయ్యపాలెం గ్రామంలో రూ.30లక్షలతో గురువారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో పరుచూరి పూర్ణచంద్రరరావు, టీడీపీ నాయకులు పాలడుగు శ్రీధర్, పరుచూరి రవి, వెంకటరావు, నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఏడాది పాలన

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



క్రోసూరులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అమరావతిలో కేక్ కట్‌చేస్తున్న కూటమి నాయకులు



పెదకూరపాడులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేత రమేష్ తదితరులు

క్రోసూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోను, పెదకూరపాడు నియోజకవర్గంలోను ఏడాది పాలన సాగిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా గురువారం క్రోసూరులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రోసూరు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అచ్చంపేట, క్రోసూరు మండలాల కూటమి పార్టీల కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వేడుకల్లో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ యర్రంశెట్టి రామకృష్ణ, తెలుగు మహిళ రాష్ట్ర అధికారప్రతినిధి వేగుం ట రాణి, టీడీపీ నాయకులు గుడిపాడు బాషా, మ న్నెం శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు నలజాల సదాశివరావు, జిల్లా టీడీపీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు దుద్దుల యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి పేర్కొన్నారు. బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథిగా సాంబశివారెడ్డి వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, అక్కల వెంకటరామిరెడ్డి, గుడిసె కొండయ్య, ఓర్చు ఆనంద్, ఆసుల జగన్, బ్రహ్మారెడ్డి, పీఎస్‌కే రసూల్, మేళం శ్రీరామ్మూర్తి, హుస్సేన్, సయ్యద్ జానీ, రజాక్, సుభానీ, రాజేష్, అక్కల బాలరామిరెడ్డి, తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, సత్యనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏడాది పండుగ వేడుకలు

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి) సుపరిపాలన స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో వేడుకలను కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. అమరావతిలోని సాయిబాబా ఆలయం వద్ద బీసీకాలనీలో టీడీపీ నాయకులు పోలిశెట్టి సాయిబాబు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి, స్వీట్‌లు పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆనంద్, వెంకట్రావు, శంకర్, జనసేన నాయకులు కె.వెంకటరమణ, కె. వెంకయ్య, కె.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి కన్నీరు తుడిచేలా కూటమి పాలన

పెదకూరపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పేదవాడి కన్నీరు తుడిచేలా కూటమి ప్రభుత్వం పాలన చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అన్నారు. పెదకూరపాడు పంచాయతీరాజ్ అతిథిగృహంలో కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, మాజీ ఎంపీపీలు బీ రామగోపాలరావు, గల్లా బాబూరావు, తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి భాష్యం ఆంజనేయులు, టీడీపీ మండల నేతలు ఏ రత్నకుమార్, జి.లీలావతి, ముంతాజ్, పి. పూర్ణచంద్రరరావు, ఎం.చంద్రశేఖర్, ఏ బ్రహ్మాయ్య, ఎం.వెంకటసత్యనారాయణ, మస్తాన్ షరీఫ్, జి.కోటేశ్వరరావు, పి.అర్లయ్య, అజ్ముల్లా, బి.రాంబాబు, జి.బాబూరావు, జి.శ్రీనివాసరావు, ఎస్ రమేష్‌పాల్గొన్నారు.

ఏడాది పాలనపై సంబరాలు



పిడుగురాళ్లలో కేక్‌కట్ చేస్తున్న కూటమి నేతలు



దాచేపల్లి: కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నేతలు

పిడుగురాళ్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ కార్యాలయాల వద్ద కేక్ కట్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం కూటమి నేతలు కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమాలలో ఏఎంసి చైర్మన్ తురకా వీరస్వామి, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, షేక్ బాబావలి, కనిగిరి శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, వడ్డవల్లి సాంబశివరావు, కామిశెట్టి రమేష్, గండికోట వెంకటేశ్వర్లు, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, పిల్లి చెన్నారావు, వల్లెపు రామకృష్ణ, కోట హరి, నడికూడి వెంకటేశ్వరరావు, జెమిలి రామకృష్ణ, కార్ సైదా, దూదేకుల ఖాశింసైదా, చేగు రమేష్, గోళ్ల కిరణ్, సుబ్బారావు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయం

దాచేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ నేతలు పేర్కొన్నారు. గురువారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఎన్‌టీఆర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే యరపతినేని చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు కొత్త మల్లిఖార్జునరావు, తంగెళ్ళ శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, నర్ర పుల్లయ్య, వేముల తిరుమల కుమార్, అక్కినపల్లి బాలయ్య, నారాయణ, అంబటి శేషగిరిరావు, అచ్చారావు, శ్రీనివాసరావు, అప్పారావు, నిమ్మయ్య, వలి, నారాయణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో రాక్షస పాలన



కేక్ కట్ చేస్తున్న కూటమి నేతలు

సత్తెనపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో రాక్షసపాలన కొనసాగిందని కూటమి నేతలు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాలతో టీడీపీ ప్రజా వేదికలో నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్య పాలన జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామ స్వామి, చౌట శ్రీనివాసరావు, మన్నవ శారదా దేవి, సయ్యద్ మాబూ, కోమటినేని శ్రీనివాసరావు, నాయకులు బండారు నాగరాజు, సయ్యద్ పెద కరిముల్లా, మస్తాన్‌వలి, నూర్‌బాషా జాన్‌బాబు, వక్కంటి అజయ్, తోట అంబిక, కంభాల వెంకటేశ్వరరావు, గుంటూరు ఆశీర్వాదం, పోతుగంటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో...

ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అద్భుత పాలన అందించిందని వ్యాపార వర్గాలు, ఆర్యవైశ్య నేతలు అన్నారు. పట్టణంలోని భవిరిశెట్టివారి వీధిలో టీడీపీ వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో ఆర్య వైశ్య నేతలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చౌట శ్రీనివాసరావు, కొల్లిపర కాశీ విశ్వనాథం, నోముల వెంకటరమణ, జవ్వాజి రామ్మోహనరావు, మస్తాన్‌వలి, దేవరపల్లి కాశీ, చెక్క రవి, ఏ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా మాచర్లను అభివృద్ధి చేసుకుందాం

● మున్సిపల్ సాధారణ సమావేశంలో చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్

మాచర్లటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాజకీయాలు, రాగద్వేషాలు పక్కనపెట్టి కౌన్సిలర్లందరూ కలిసికట్టుగా పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ అన్నారు. గురువారం పురపాలక సంఘ సాధారణ సమావేశం చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పలు అంశాలను చైర్మన్ దృష్టికి తీసుకురాగా తప్పనిసరిగా స్పందించాల్సిన అంశాల్లో స్పందిస్తామని, పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఒకటో వార్డు కౌన్సిలర్ గట్ల అరుణకుమారి మాట్లాడుతూ ఎలక్షన్ సమయంలో పట్టణం పోలింగ్ బూత్‌లకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.5లక్షల నిధులు వెచ్చిస్తే ఇప్పటివరకు బిల్లులు రాలేదని సమావేశం దృష్టికి తెచ్చారు. చైర్మన్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు స్పందిస్తూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అజెండాలోని 15 అంశాలు, టేబుల్ అజెండాలో వచ్చిన రెండు అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ యర్రాకుల సిద్ధమ్మ సిద్ధయ్య యాదవ్, డీఈ సుభాని, టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ మదార్‌సాహెబ్, వైస్ చైర్‌పర్సన్ యర్రాకుల సిద్ధమ్మ సిద్దయ్య యాదవ్‌ను వైసీపీ కౌన్సిలర్లు దుశ్శాలువతో సన్మానించడం కొసమెరుపు.

అమృత్ సరోవర్‌తో వెంకటప్పయ్య కుంట అభివృద్ధి

● డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి



కుంకలగుంటలో వెంకటప్పయ్య కుంటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, పక్కన కనుమూరి బాజీ చౌదరి

నకరికల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా కుంకలగుంటలోని వెంకటప్పయ్య కుంటను అమృత్ సరోవర్ కింద అన్నివిధాలా అభివృద్ధి చేయనున్నట్లు డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి గురువారం తెలిపారు. మండలంలోని కుంకలగుంటలో ఉన్న వెంకటప్పయ్య కుంటను ఆయన పరిశీలించారు. కట్ట బలోపేతానికి, వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యల గురించి ఎంపీడీవో జీ కాశయ్య, ఏపీవో జీ ప్రసాదు, ఈసీ కృష్ణకుమారికి సూచనలు చేశారు. ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, ఎంపీడీవో జీ కాశయ్య, ఏపీవో జీ ప్రసాదు, వీసీ కృష్ణమూరి, టీఏ రమణ, ఎఫ్ కొల్లి హరి ప్రసాదు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఉపాధి పథకంలో అవకతవకలకు పాల్పడినా, తప్పులు జరిగినా చర్యలు తప్పవని పీడీ సిద్ధ లింగమూర్తి అన్నారు. కండ్లకుంటలో ఉపాధి అక్రమాలపై ఆయన విచారణ చేపట్టారు. గ్రామంలో అక్రమాలు జరిగాయని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీడీ విచారణ చేపట్టారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

సత్తెనపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలం బయ్యవరానికి చెందిన షేక్ శ్రీనివాసరావు హత్య కేసులో నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న షేక్ శ్రీనివాసరావుకు అమరావతి మం డలం మునగోడుకు చెందిన సాధనాల గోపయ్య కు మధ్య ఘర్షణ జరిగింది. టాటా మ్యాజిక్ వా హనంపై పిల్లలకు గోపయ్య డ్రైవింగ్ నేర్పిస్తుండగా.. ఒక పిల్లవాడు రోడ్డుకు అడ్డంగా ఉండగా పక్కకు వెళ్లమన్న విషయంలో గొడవ జరిగింది. ఈ ఘర్షణను దృష్టిలో పెట్టుకొని సాధనాల గోపయ్య బంధువులు బయ్యవరంలో ఉంటున్న శ్రీనివాసరావు గృహానికి వెళ్లి అతనిపై తీవ్రంగా దాడి చేశారు. ఈ దాడిలో శ్రీనివాసరావు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు 6వ తేదీ మృతి చెందాడు. మృతుని తమ్ముడు శివబాబు ఫిర్యాదు మేరకు క్రోసూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా అమరావతి మండలం మునగోడుకు చెందిన సాధనాల గోపయ్య, సాధనాల విజయబాబు, కడియం శ్రీకాంత్‌ను బయ్యవరం గ్రామ శివారుల్లో అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రెండు కర్రలు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని వెల్లడించారు. ఈ సమావేశంలో పెదకూరపాడు సీఐ పత్తిపాటి సురేష్, క్రోసూరు ఎస్ఐ రవిబాబు, సిబ్బంది ఉన్నారు.

బెల్లంకొండ ఎంపీడీవోగా సునీత

బెల్లంకొండ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ నూతన ఎంపీడీవో పీ సునీత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెల్లంకొండ మండల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వ సంబరాలు



కారంపూడిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నేతలు



దుర్గిలో సంబరాలు నిర్వహిస్తున్న కూటమి నేతలు

కారంపూడి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సుపరిపాలనకు తొలి అడుగుపడి ఏడాది పూర్తయిన సందర్భంగా కారంపూడిలో గురువారం భారీర్యాలీ నిర్వహించారు. తెలుగుయువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం ఏర్పడ్డనాటి నుంచి మం డలం అభివృద్ధిలో సాగుతుందన్నారు. కార్యక్రమంలో కర్నా సైదారావు, ఉప ఎంపీపీ గాడిపత్రి రమాదేవి, చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, బొమ్మిన శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని బస్టాండ్ సెంటర్లో కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, సుమంత్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసరావు, శివయ్య, రామకృష్ణ, రాజ్‌కుమార్, నాగయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనకు ఏడాది కావడంతో మండలంలోని విజయపురిసౌత్‌లో కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి, విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఆడెపు కోటయ్య, బొబ్బిలి చంద్రశేఖర్, ఎం.అప్పలరాజు, ఊరే మార్కు, కట్టా రాజు తదితరులు పాల్గొన్నారు.

● దుర్గి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది నిండిన సందర్భంగా గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఎస్‌బీఐ వరకు ర్యాలీ నిర్వహించారు. తదుపరి బస్టాండ్ సెంటర్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతా సాయిశంకర్, ఎంపీడీవో శివప్రసాద్, సత్యప్రసాద్, లింగా రమేష్, దారా రాఘవరావు, రామారావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, శ్రీనివాసరావు, మారుగుండ్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● గురజాలటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అడపా శ్రీనివాసరావు, బొల్లయ్య, నాగేశ్వరరావు, శ్యామ్, హనుమంతురావు, శ్రీనివాసరావు, నజీమూన్, ప్రకాష్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ధ్రువీకరణ పత్రాలు కలిగివుండాలి

పెదకూరపాడు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వాహనదారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, వాహనాలు నడిపే సమయంలో సీటు బెల్టు పెట్టుకోవాలని మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎం సురేష్‌బాబు అన్నారు. పెదకూరపాడు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గురువారం వాహనాలను తనిఖీచేసి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 12 వాహనాలకు రూ 21వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఏ పాతిమా రోశమ్మ, ఏఎస్ఐ రామ్‌జీ నాయక్ పాల్గొన్నారు.

ఎగువ పల్నాడు పురోగమిస్తోంది

● రూ. 1,583 కోట్లతో ఎన్నడూ లేని అభివృద్ధి

● రూ. 241 కోట్లతో సంక్షేమం

● విజయోత్సవ సభలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎగువ పల్నాడుగా ఉన్న మాచర్ల నియోజకవర్గం నలుదిశలా పురోగమిస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా.. మాచర్లలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద పట్టణ ఆర్యవైశ్య నేతల ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన విజయోత్సవ సంబరాల్లో ఎమ్మెల్యే జూలకంటి పాల్గొన్నారు. భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. రూ.1,583 కోట్లతో మాచర్ల నియోజకవర్గంలో పనులు చేపట్టినట్లు వెల్లడించారు. మరోవైపు దాదాపు రూ.250కోట్లతో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, దాదాపు రూ.6కోట్లతో సీఎం సహాయనిధి అందజేత వంటి సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. వరికపూడిశెలకు అతి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో రూ.984 కోట్లతో జల జీవన్ మిషన్, అమృత స్కీం ద్వారా నిధులు వెచ్చించినట్లు ఎమ్మెల్యే జూలకంటి పేర్కొన్నారు. అలాగే రూ.452 కోట్లతో ఆర్‌అండ్‌బీ నిధులు ద్వారా దావుపల్లి జాతీయ రహదారి నిర్మించామని, విద్యా, వైద్య రంగాలకు దాదాపు రూ.45కోట్లు వెచ్చించామన్నారు. సంక్షేమం గురించి సైకోలకు ఏం తెలుసునని జగన్‌రెడ్డిని ఉద్దేశించి ఎమ్మెల్యే చురకలంటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, పంగులూరి అంజయ్య, పుల్లయ్య, కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, కుమారు, శ్రీను, కొమెర శివ, కంభంపాటి అనిల్, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, మోసిన్, శివపార్వతి, శాంతినాయుడు, వజ్రం నాయక్, పోలూరి నరసింహారావు, క్రాంతికుమార్, యేచూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జూలకంటికి వివరాలు తెలియచేస్తున్న తహసీల్దార్ మేరి కనకం

నష్టపరిహారం పెంచాలని రైతుల ఆందోళన

● న్యాయం చేస్తామని ఎమ్మెల్యే జూలకంటి హామీ..

రెంటచింతల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారి(167ఏడీ) నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు చెల్లిస్తున్న నష్టపరిహారం తమకు సమంజసం కాదంటూ గురువారం బాధిత రైతు కుటుంబాలు నిరసనకు దిగాయి. ఎస్ఐ సీహెచ్ నాగార్జున నేతృత్వంలో పోలీసు బలగాలు రంగంలోకి దిగారు. ఇప్పటిదాకా భూముల్లో ఏర్పాటుచేసిన నర్సరీ నిర్వాహకులకు ఎకరాకు రూ.1.37 కోట్లు దాకా చెల్లించి భూములు కోల్పోయిన నిజమైన లబ్ధిదారులకు కేవలం రూ.38.20లక్షలు చెల్లిస్తామని ప్రకటించడం ఏం న్యాయమంటూ ప్రశ్నించారు. నష్టపరిహారాన్ని పెంచాలని లేనిపక్షంలో బైపాస్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.2కోట్లు చెల్లించాల్సిందేనని భీష్మించుకుని కూర్చున్నారు. తహసీల్దార్ మేరి కనకం, ఎస్ఐ నాగార్జున, ఆర్ఐ రామకృష్ణ, నేషనల్‌హైవే అధికారులు వారిని శాంతింపజేశారు.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

జాతీయ రహదారి నిర్మాణంలో పొలాలను కోల్పోయిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వపరంగా న్యాయంజరుగుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హామీనిచ్చారు. విజయవాడ వెళ్తున్న ఎమ్మెల్యే రైతుల ఆందోళన చూసి.. వాహనాన్ని నిలిపి రైతులు, తహసీల్దార్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, బాధిత రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎకరాకు రూ.38లక్షల 20వేలు చెల్లిస్తున్నారని దీనికి మరో 20 శాతం అధికంగా చెల్లిస్తారని ఇదే విషయాన్ని కలెక్టర్‌కు చెప్పినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. గతంలో ఇక్కడ వేసిన వెంచర్లలో ఎక్కువ ధర చెల్లించి ప్లాట్లు కొన్నామని ఇప్పుడు ఇచ్చే ధర తమకు ఏ మాత్రం సమ్మతం కాదని మాజీ ఎంపీటీసీ మెంబర్ శ్రీనివాసరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చూస్తాననిచెప్పారు.

నేడు కొండవీడుకోట ఘాట్ మార్గంలో యోగాంధ్ర

యడ్లపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా రద్దయిన యోగాంధ్ర కార్యక్రమం చారిత్రక కొండవీడుకోట ఘాట్ రోడ్డు ప్రారంభంలోని చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఉదయం జరగనుంది. ఈ నెల 11న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా వర్షం కారణంగా అధికారులు రద్దు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం 6గంటలకు చారిత్రక కొండవీడుకోట ఘాట్ మార్గం ప్రారంభంలోని చెక్‌పోస్టు వద్ద నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో ఆయుష్‌శాఖతోపాటు, పర్యాటక, అటవీ, వైద్యఆరోగ్య, పంచాయితీరాజ్, రెవెన్యూ, ఐసీడీఎస్ వంటి శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొననున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కళానిలయం రాజమోహనరావు కన్నుమూత

చిలకలూరిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట కళానిలయం సంస్థ వ్యవస్థాపకుడు ప్రగడ రాజమోహనరావు (84) గురువారం కన్నుమూశారు. పీఆర్ మోహన్‌గా ఆయన చిరపరిచితులు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిలకలూరిపేటలో ఆయన కళానిలయం సంస్థను స్థాపించి 40ఏళ్లగా జాతీయస్థాయిలో నృత్యపోటీలు నిర్వహించారు. గత నెలలో కూడా ఈ పోటీలు జరిగాయి. కళానిలయం ద్వారా 160 మందికి పైగా ప్రముఖులకు పురస్కారాలు అందచేశారు. ఆయన స్వయంగా పలు నాటికలలో నటించి 25కు పైగా వ్యక్తిగత పురస్కారాలు అందుకున్నారు. సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. ఆయన మిత్రులు నాయుడు శివ, గంజి పోలయ్య, రత్నబాబు, పలువురు కళాకారులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

బంగారం వ్యాపారి కొల్లా మృతి

చిలకలూరిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బంగారం వ్యాపారి కొల్లా శ్రీరామమూర్తి (75) గురువారం మృతి చెందారు. ఆయన మృతికి సంతాప సూచికంగా పట్టణంలోని గోల్డ్ షాపులను గురువారం మూసివేశారు. శ్రీరామమూర్తి మృతికి స్థానిక సీఆర్ క్లబ్ యాజమాన్యం సంతాపం ప్రకటించింది.

విమాన ప్రమాదం బాధాకరం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ సర్దార్ వల్లభాయి పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం బాధాకరమని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విమాన ప్రమాదంలో మృతిచెందిన వారికి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగి వేగంగా సహాయక చర్యలు చేపడుతున్న కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారిగా ఉపేంద్రకుమార్

నరసరావుపేట టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారిగా నరసరావుపేట మార్కెటింగ్ యార్డు కార్యాలయంలో కేవీఎస్ ఉపేంద్రకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా నుంచి పల్నాడు జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు ఉపేంద్రకుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

జాతీయ తైక్వాండో పోటీలకు చిలకలూరిపేట విద్యార్థుల ఎంపిక

చిలకలూరిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో త్వరలో జరుగబోయే తైక్వాండో పోటీలకు స్థానిక గాంధీపేటలోని చైతన్య లిటిల్స్ స్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 9 నుంచి 11 వరకు తాడిపత్రిలో ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన తైక్వాండో పోటీలలో 14 మంది స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. 6 వెండి, 4 కాంస్య పతకాలు సాధించారు. వెండి పతకాలు సాధించిన వారు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతలను స్కూలు డైరెక్టర్ ఈవీ గిరీష్ బాబు, ప్రిన్సిపాల్ డీవీ లక్ష్మి, ఏవో రామకృష్ణ, కోచ్ అనురాధయ్య గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించి సత్కరించారు.

ప్రశాంతంగా మెగా డీఎస్సీ: డీఈవో

నరసరావుపేట టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఏపీ మెగా డీఎస్సీ-2025ను నిర్వహించినట్లు డీఈవో ఎల్ చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సెషన్-1లో 874మందికి 796 మంది, సెషన్-2లో 77మందికి, 61మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. జిల్లాలో మొత్తం ఐదు ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

క్లుప్తంగా...

రొంపిచర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులైన రైతులకు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో పల్లా శివలీల గురువారం తెలిపారు. సేవా కేంద్రంలోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజు గురువారం హాజరు నామమాత్రంగా ఉంది. పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను సర్వేపల్లి విద్యామిత్ర కిట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేశారు.

● నూజెండ్ల: నూజెండ్ల మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ ఆంజనేయులు నాయక్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న సుగుణాబేగం బదిలీ కావటంతో నెల్లూరు జిల్లా ఉదయగిరి నుంచి ఆంజనేయులు నాయక్ బదిలీ అయ్యారు.

● ఈపూరు: మండలంలోని కొచ్చెర్లలో గురువారం ఎమ్మార్పీయస్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మండల నాయకుడు స్వర్ణా మసలయ్య మాట్లాడుతూ జూలై 7వ తేదీన ఎమ్మార్పీయస్ 31వ వార్షికోత్సవం ఘనంగా జరుపుకుందామన్నారు.

ఏడాదిలో అభివృద్ధి దిశగా రాష్ట్రం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



సుపరిపాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి డీసీసీబీ చైర్మన్ మల్లికార్జునరావుకు తినిపిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సంవత్సర కాలంలోనే రాష్ట్రాన్ని అధోగతి నుంచి అభివృద్ధి శిఖరాల వైపు నడిపించే దిశగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతోందని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా గుంటూరులోని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చెందిన టీడీపీ కార్యాలయంలో గురువారం కూటమి నాయకులు జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జీవీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులతో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, సామర్థ్యం, విశ్వసనీయతల కారణంగానే సాధ్యమైందన్నారు. స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యంగా సాధనలకు ప్రజా స్వామ్యబద్ధంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు ఏడాది పూర్తి...

వినుకొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సుపరిపాలనకు తొలి అడుగుపడి నేటికి సంవత్సరం కాలం పూర్తయిన సందర్భంగా చీఫ్ విప్ కార్యాలయంలో జీవీ ఆంజనేయులు కేక్ కట్‌చేసి కార్యకర్తలకు, నాయకులకు పంపిణీ చేశారు. అనంతరం కారంపూడి రోడ్డులోని కాలవ కట్ట వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పాలభిషేకం చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమాభివృద్ధి కొనసాగుతుంది: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమాభివృద్ధి కొనసాగుతుందని, నా విజయం నరసరావుపేట ప్రజలకు, నాయకులకు అంకితం అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. గురువారం కూటమి సుపరిపాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా నరసరావుపేట పట్టణంలో విజయోత్సవ ర్యాలీ జరిగింది. టీడీపీ నియోజకవర్గ కార్యాలయం నుంచి చెక్‌పోస్ట్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు స్వయంగా ట్రాక్టర్ నడిపాశారు. కూటమి నాయకులు, శ్రేణులు, మహిళలు, టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించిందని, త్వరలో మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, నియోజకవర్గ పరిశీలకుడు మన్నవ మోహన కృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ జెల్లిపల్లి శేషమ్మ, నల్లపాటి రామచంద్రప్రసాదు, గట్టు పల్లి సత్యనారాయణ, దాసరి ఉదయశ్రీ, మిరియాల వెంకట సుబ్బమ్మ, కొట్లా కిరణ్, కడియాల రమేష్‌బాబు, బాదుగున్న శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ర్యాలీలో పాల్గొన్న మహిళలు, కార్యకర్తలు

చిలకలూరిపేటలో ...

చిలకలూరిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన సంబరాలు గురువారం స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో ప్రత్తిపాటి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. స్థానిక పొట్టిశ్రీరాములు వీధిలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో, పట్టణంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన సంబరాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలలో ప్రత్తిపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలాంటి భయాందోళనలు లేకుండా ప్రజలు గుండెలపై చేయివేసుకొని ప్రశాంతంగా జీవిస్తున్నారని, అందుకు కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వమని, రాష్ట్రప్రగతికి ఆయన నాయకత్వమే ఇంధనం అని అన్నారు. దేశంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు చంద్రబాబు వయసుని లెక్కచేయకుండా శ్రమిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ చొరవతోనే రూ.9.70 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. ప్రజలు మరో 15ఏళ్లపాటు కూటమి ప్రభుత్వానికి మద్ధతు పలకాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భాన్ని పురస్కరించుకొని నేటినుంచే తల్లికి వందనం అమలుకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి, 67,27,164 మంది విద్యార్థులకు మేలుచేసేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. పథకంలో భాగంగా తమ బిడ్డల చదువుల కోసం తల్లుల ఖాతాలకు రూ.8745 కోట్లు జమచేస్తున్నారన్నారు. ఈ నెల 21 నుంచి అన్నదాత సుఖీభవ కింద అర్హులైన ప్రతిరైతు ఖాతాకు తొలివిడతగా రూ.7వేల ఆర్థికసాయం అందించనున్నారని తెలిపారు. ఆగస్టు 15న ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కూడా ప్రవేశపెట్టడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వ పనితీరు చూసి తట్టుకోలేని కొందరు స్వార్థపరులు చేసే దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని ప్రత్తిపాటి కోరారు. కార్యక్రమాలలో కూటమి పార్టీల నాయకులు పలువురు పాల్గొన్నారు.



చిలకలూరిపేట టీడీపీ ఆఫీసులో ఏడాది పాలన సంబరాలలో భాగంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, పార్టీ నాయకులు



వినుకొండలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

నరేంద్రమోడీ నాయకత్వంలో అన్ని రంగాల్లో భారత్ ముందంజ

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్

నరసరావుపేట టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నరేంద్రమోడీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో ముందంజలో ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ అన్నారు. గురువారం నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల లలిత కళా ప్రాంగణంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా వల్లూరి జయప్రకాష్ మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం విశ్వగురువుగా ఆవిర్భవించాలని నరేంద్రమోడీ నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. 2014లో నరేంద్రమోడీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని రంగాలలో సమాన అభివృద్ధితో ముందుకు వెళుతుందన్నారు. పేదలు, యువకులు, మహిళలు, వెనుకబడిన వర్గాలు రైతులను అభివృద్ధిపథంలోకి వెళుతున్నారన్నారు. పేదలందరిని గరీబ్ కల్యాణ్ యోజన పథకంలో 81కోట్లు మందికి ఉచిత రేషన్ ఇస్తున్నారని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పేరుతో వారందరికి రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందజేస్తారన్నారు. ఆర్థిక స్వాలంబన కింద ముద్ర యోజన కింద రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు, ఇప్పుడు పరిస్థితులను బట్టి రూ.25లక్షల వరకు పావలా వడ్డీకే ఉపయోగించుకునే అవకాశం కల్పించారన్నారు. పసల్ బీమా యోజన కింద రైతులకు మద్దతు ఇచ్చేలా ప్రభుత్వం ఉందన్నారు. 2014లో రూ.12వందలు ఉన్న మద్దతు ధర ఇవాళ రూ.23వందల వరకు పెంచారన్నారు. కిసాన్‌సమాన్ యోజన కింద రూ.6వేలు ఎటువంటి షరతులు లేకుండా రైతులకు అందజేస్తున్నారని చెప్పారు. నరేంద్రమోడీ నాయకత్వంలో 23 ఐఐటీలు, 16 ఐఐఎంలు ఉన్నాయంటే విద్యాభివృద్ధికి ఎంత ఆలోచన చేస్తున్నారో అర్థం అవుతుందన్నారు. నైపుణ్య శిక్షణ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు దేశవ్యాప్తంగా మోడీ నాయకత్వంలో ఏర్పాటుచేశారని చెప్పారు. కేవలం ఈ 11 సంవత్సరాలలో వంద బిలియన్ డాలర్ల కంపెనీలు 1600 ఏర్పాటవటం, సుమారు లక్ష 50 వేల స్టార్టప్ కంపెనీలు నరేంద్రమోడీ అవగాహనతో ఏర్పాడటం జరిగిందన్నారు. భారతదేశం ఆర్థికంగా నాలుగో స్థానంలో చేరామంటే ఎన్డీఏ లక్ష్యం అర్థం అవుతుందన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యం ఒకటి, రెండు స్థానాలకు భారత ఆర్థిక వ్యవస్థ చేరాలని ప్రణాళికలు రూపొందించారన్నారు. మోదీ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో కూడా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. సమావేశంలో పార్లమెంట్ కన్వీనర్ చిరుమామిళ్ళ అదినారాయణ, మాజీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.కృపారావు, జనరల్ సెక్రటరీ ఎం.రమేష్, బీజేపీ రాష్ట్ర ప్రోగ్రామ్ కన్వీనర్ వీ కపర్ది, జిల్లా అధ్యక్షుడు ఏలూరు శశికుమార్,జిల్లా ఇన్‌చార్జి కే శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.వెంకటరావు, ఎ.సుధాకర్ బాబు, పీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

నరసరావుపేట టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే-2025 పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యార్థులు ఫలితాలను మన మిత్ర (వాట్సాఫ్ గవర్నెన్స్ ఇనిషియేటివ్), అధికారిక ఫలితాల పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూరిజల్ట్స్‌బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల లాగిన్‌లో కూడా ఫలితాలను పొందవచ్చనన్నారు. పల్నాడు జిల్లాలో 86.49 శాతం ఉత్తీర్ణత, రాష్ట్రవ్యాప్తంగా 8వ స్థానం సాధించారని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4092 విద్యార్థులకు గాను 3539 ఉత్తీర్ణులు అయ్యారన్నారు.

రీ వెరిఫికేషన్, రీ కౌటింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు తమ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంను సంప్రదించి, పాఠశాల ద్వారా దరఖాస్తు రుసుం సమర్పించాలన్నారు. అభ్యర్థులు 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 19వ తేదీ రాత్రి 11గంటల వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ బీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వద్ద అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ దరఖాస్తు ద్వారా సమాధాన పత్రాల రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం దరఖాస్తు చేయవచ్చన్నారు. రీ కౌంటింగ్ సబ్జెక్టుకు రూ.500లు, రీ వెరిఫికేషన్‌కు సబెక్టుకు రూ.వేయి చెల్లించాలన్నారు. ఆఫ్‌లైన్ పద్ధతి ద్వారా చేసిన దరఖాస్తులను స్వీకరించబడవని డీఈవో ఎల్ చంద్రకళ వివరించారు.

రక్తదానంపై యువతకు అవగాహన కల్పించాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ సభ్యులు రక్తదానం పై యువతకు అవగాహన కల్పించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. మండల కేంద్ర మైన నాదెండ్ల ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో రెడ్‌క్రాస్ సొసైటీ వారు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరం నిర్వాహకులు, సొసైటీ సభ్యులతో మాట్లాడారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపరాణి, టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా, నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, జే మదన్, ఎన్ హరిబాబు, గంగా శ్రీనివాసరావు, గుర్రం నాగ పూర్ణచంద్రరరావు, విజయ సాయి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కమిటీ సభ్యులకు సత్కారం

నాదెండ్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నార్నె కోటయ్య స్వామి, కోటా మహేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే పుల్లారావును కలిశారు. ఆయన వారిని సత్కరించి, గ్రామంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండారుపల్లి సత్యనారాయణ, జంపని వసంతరావు, కమ్మ పెద శ్రీనివాసరావు, ఐనవోలు రాధా, వలేటి హిమవంతరావు, సీహెచ్ సుబ్బారావు, ఎన్ శివ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత ప్రారంభం

వినుకొండ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డ్రెయిన్లను మెరుగుపరచాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు డ్రెయిన్లలో పూడికతీత పనులను గురువారం ప్రారంభించారు. మార్కాపురం రోడ్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయాధికారి సమీక్ష



పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న న్యాయాధికారి సలోమి

నరసరావు పేట లీగల్, జూన్ 12, (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జూలై 5న స్థానిక న్యాయస్థాన భవనాల ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై గురువారం మొదటి అదనపు జూనియర్ అధికారి ఏ సలోమి పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రిమినల్ కేసులను పెద్దసంఖ్యలో రాజీ మార్గంలో పరిష్కరించుకుని సహకరించవలసిందిగా పోలీసు అధికారులను కోరారు. ఈ సందర్భంగా క్రిమినల్ కేసుల పరిష్కార సమయంలో తలెత్తే న్యాయపరమైన పలు అంశాలను న్యాయాధికారి వివరించారు. పోలీస్ అధికారుల న్యాయపరమైన సందేహాలను నివృత్తి చేశారు. సమీక్షలో న్యాయవాద సంఘ కార్యదర్శి శ్రీరామినేని ప్రసాద్ సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

నరసరావుపేట లీగల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏ సలోమి కోరారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయాధికారి సలోమి మాట్లాడుతూ చాలామంది పిల్లలు ఇప్పటికీ కూడా బాల కార్మికులుగా వివిధ దుకాణాలలో పనిచేయడం దారుణమన్నారు. అటువంటి పిల్లలు తప్పనిసరిగా విద్యను అభ్యసించేలా అన్నిశాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ కార్యదర్శి ఎస్.ప్రసాద్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, నరసరావుపేట రూరల్ పోలీసులు, అదనపు సిడీపీవో మాణిక్యాలరావు, డీసీపీవో శౌరిరాజు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు పంపిణీ

కారుమంచి (శావల్యాపురం) జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజే మండలంలోని కారుమంచి జడ్పీ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అందించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను హెచ్‌ఎం విన్‌సెంట్ ఫిలోమన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ మల్లాపరపు గాలెయ్య, ఎస్ఎంసీ చైర్మన్ తొకిటి రఘు, వైస్‌చైర్మన్ మండే సుజాత, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, కారుమంచి ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోటా హరిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గోపాళం శివప్రసాద్, టీడీపీ నేతలు పులుకూరి వెంకట్రామయ్య, ఐమాల నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలలు తెరిచిన తొలిరోజునే ప్రభుత్వం విద్యార్థులకు విద్యామిత్రకిట్లు పంపిణీ చేయడం అభినందనీయమని, విద్యార్థులంతా ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

నూజెండ్ల మండలంలో...

నూజెండ్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు గురువారం వేసవి సెలవులు అనంతరం నూతన విద్యా సంవత్సరంలో పునఃప్రారంభమయ్యాయి. మండలంలోని 4,800మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 3,500మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో ఎన్ రవిచంద్ర తెలిపారు. నూతన విద్యా సంవత్సరం మొదటి రోజు నుంచే విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు ఎంఈవో వివరించారు. పెద్దవరం ఉన్నత పాఠశాలలో జరిగిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధూపాటి రత్తమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ చిన్న ఆంజనేయులు, పాఠశాల హెచ్‌ఎం ఘంటా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలతో హెచ్‌ఐవీ నివారణ

● ఏపీ సాక్స్ జేడీ మంజుల

నరసరావుపేట లీగల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హెచ్ ఐ వీతో జీవించే వారికి మెరుగైన సేవలు అందించి హెచ్‌ఐవీ నివారణ చేయవచ్చని ఏపీ సాక్స్ జాయింట్ డైరెక్టర్ టి మంజుల అన్నారు. గురువారం స్థానిక డీ ఏం అండ్ హెచ్‌వో కార్యాలయంలో పల్నాడు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం జిల్లాలో పనిచేస్తున్న ఐసీటీసీ కేంద్రాలు, ఏ ఆర్ టీ సెంటర్లు, స్వచ్ఛంద సంస్థలతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టి.మంజుల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మే నాటికి చేసిన కార్యక్రమంలో వైరల్ లోడ్ పరీక్ష సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు, ఏఆర్‌టీ సెంటర్లలో మందులు వాడే వారు ప్రతిరోజు సరియైన సమయానికి మందులు వాడేలా చేయాలని కోరారు. వైరల్ లోడ్ పరీక్షలో 200 కన్నా తక్కువ వస్తే వారి ద్వారా ఇతరులకు హెచ్‌ఐవీ వ్యాపించదన్నారు. జిల్లా లెప్రసీ ఎయిడ్స్ క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ మాట్లాడుతూ గర్భిణులకు తప్పనిసరిగా సకాలంలో హెచ్‌ఐ వీ పరీక్షలు చేసి పాజిటివ్ వచ్చిన వారికి వెంటనే మందులు వాడేలా చేయాలన్నారు, 32 నుంచి 36 వారాల మధ్య తప్పనిసరిగా వైరల్ లోడ్ పరీక్ష సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీ, జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ రత్నా కుమార్, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ శశిధర్‌రెడ్డి, రీడ్స్, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్, క్యాంప్ స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, సీటీసీ కేంద్రాలు, ఏఆర్‌టీ సెంటర్లు మెడికల్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.